గల్పిక

# పందికొక్కులు

దేశంలో పందికొక్కుల విజృంభణ నానాటికీ తీవ్రమయింది. మనిషి చెమటోడ్చి పండించిన ధాన్యంలో పదోవంతు పందికొక్కుల కమిషనుగా ఆమోదించబడుతూ వస్తున్నది. కాని యాభై శాతం పందికొక్కులు తినెయ్యడం చాలా తప్పు. అందుకని కొందరు యువకులు పందికొక్కులను వెతికి చంపసాగారు. పందికొక్కులను చంపడం హింస. వేద విరుద్ధం. అందుచేత ప్రభుత్వం పందికొక్కులను చంపే వాళ్ళను వేటాడి తుపాకులతో కాల్చటమూ, పట్టుబడితే కారాగారగృహాలలో పెట్టి చిత్రహింసలు చేయడమూ సాగించింది.

అయినా "పందికొక్కులు నశించాలి" అన్న నినాదం ఇచ్చింది ప్రభుత్వం. "ఇది కపట నినాదం. ఈ ప్రభుత్వం పందికొక్కులను తుపాకులతో కాపాడుతున్నది" అంటూ కొందరు రాజకీయవేత్తలు బయలుదేరి, అహింసా విధానంలో పాత ప్రభుత్వాన్ని పడగొట్టి, కొత్త ప్రభుత్వం ఏర్పాటుచేశారు.

వీళ్ళు ప్రజలకు హామీ ఇచ్చారు! "పందికొక్కుల్ని అదుపులో వుంచుతాం. దేశంలో ఆహార ధాన్యాల కొరత తీరుస్తాం" కాని పందికొక్కుల విజృంభణ తగ్గలేదు. వొచ్చింది కొత్త ప్రభుత్వం ఏం చేస్తున్నదని ప్రజలు అడిగారు.

అలా అడగడం అన్యాయం. కొత్త ప్రభుత్వం చేతులు కట్టుకుకూర్చోలేదు. అది పందికొక్కులను అదుపులో వుండమని వేడుకున్నది. న్యాయంగా పది శాతం భోంచెయ్యమన్నది. అంతకు మించి తినడం అక్రమమనీ, అలా చేస్తే కఠినచర్యలు తీసుకోబడతాయనీ అన్నది. ఆ చర్యలు ఎలాంటివో అవి పరమ రహస్యం. పందికొక్కుల్ని అదుపులో పెట్టడానికి పదేళ్ళు వ్యవధి ఇయ్యమని, పోయిన ప్రభుత్వం పెంచిన పందికొక్కుల్ని అదుపుచెయ్యడం త్వరలో జరిగే పని కాదని, అయినా పందికొక్కులను వేటాడే వాళ్ళ ప్రాణాలు తీసే అహింసా కార్యక్రమం అక్షరాలా జరుగుతుందని కొత్త ప్రభుత్వం అటు ప్రజలకు, ఇటు పందికొక్కులకు కూడా హామీ ఇచ్చింది.

అందుచేత మళ్ళీ అయిదేళ్ళకు ప్రజలు ఈ ప్రభుత్వాన్నే ఎన్నుకుంటే, పదేళ్ళ తరువాత నందో రాజా భవిష్యతి.

కొడవటిగంటి కుటుంబరావు

# పట్టుచీర




కామేశ్వరమ్మగారు ఆ వీధికి పెద్దమ్మగారు. ఎవరు ఏ చీర కొనాలన్నా ఆమె సలహా మీదనే కొంటారు. అలా అని ఆమె పిచ్చి సలహాలు ఏమీ ఇవ్వరు. చక్కని సలహాలనే ఇస్తారు. ఆమె చాలా హై క్లాస్ సొసైటీలో తిరిగే మనుష్యులనే గౌరవిస్తారు. చాలా హై క్లాస్‌గానే మాట్లాడుకొంటారు. వాటిల్లో కొన్ని-

"మన సులోచన... అదే డాక్టరిగారి భార్య మొన్ననే కంచి పోయి పట్టు చీర పట్టుకొచ్చిందర్రా! అబ్బ! ఎంత బావుందనుకొన్నారు... పిచ్చి ముండ... ఎంత ముద్దేసిందో... ధర ఎంతనుకొన్నారు... ఇరవై రెండు వేలే..."

"మన సుగుణ లేదూ... అదే థియేటర్ రంగారావు గారి భార్య... మొన్న విజయవాడలో తెచ్చింది... ఎనిమిది వేల ఏడువందల యాభై అట..."

"ఆ! ఏముంది లేద్దురూ! జీవితం క్షణభంగురం. మనం మనకు నచ్చిన చీరనల్లా కొనుక్కొని కట్టుకుంటే చాలు... ఈ జీవితానికి ఇంకేం కావాలి..."

ఇలా ఆమెగారి మాటలు ఉంటాయి. తన దగ్గరకు ఎవరొచ్చినా పాపం ఆ వయస్సులో గూడా శ్రమ అనుకోకుండా బజారు బయలుదేరి - చాలా షాపులూ విచారించి - అనేక రకాలు బేరమాడి, బామాలి... ప్రార్థించి - చాలా తక్కువగా చీరలు ఇప్పిస్తుంది.

కొందరికి కామాక్షమ్మ గారికి షాపు వాడు ఇలా బేరాలు తెచ్చినందుకు కమీషన్ ఏదైనా ఇస్తాడా అనే అనుమానం లేకపోలేదు. కాని పాపం వాళ్ళే వెళ్తే - ఆ రేటుకి కొనలేరు. అందుకే కామేశ్వరమ్మ గారు కావాలి అందరికీ!

చివరకి - రానే వచ్చింది కామేశ్వరమ్మ గారి ముద్దుల మనవరాలి పెళ్ళి! ఇంకేం - పట్టు చీరకై ఆమె వందిమాగధ పరివారంగా బయలుదేరింది.

ఐదారు ఊళ్ళుతిరిగారు. అహ! చివరికివిజయవాడలో 'పట్టుచీరల నిలయానికి' వచ్చారు.

ఆమెకు నచ్చిన చీర... ధర 6,000/- అది ఆమెకు ఎంతగానో నచ్చింది. చీరంతా జరీ - సన్నని గడి - చుట్టూ అందమైన బోర్డరు... పెద్దపెద్ద పూలూ... ఆ చీరలో మనవరాలు ముద్దుగా కట్టుకుని భర్తకూ, తనకూ షాదాభి వందనం చేస్తున్న దృశ్యం మూసుకున్న కళ్ళలో కదిలి ఉక్కిరిబిక్కిరి ఐంది.

ఆషాపు వాడు ఈమె పారవశ్యం గ్రహించాడు. ఆమె కళ్ళుమూసుకున్నసందర్భంలో ఒకబోర్డునుతగిలించాడు. అది 30% రిబేటు అన్ని పట్టు చీరల మీదా అని.

అదే చూపాడు ఆమెకు.ఆమెహృదయంఆనందంతో గంతులు వేసింది. బేరం చేయసాగింది.

ఇలా 30% రిబేటు 50% పెంచింది. షాపు వాడు "మీలాంటి పెద్దవారు అడిగారు కనుకా తప్పదని 3,000/-లకే చీరను ప్యాక్ చేసి ఇచ్చాడు."

తన పరివారంతో చీరను తీసుకుని ఇంటికి వచ్చారు. వీధి వీధంతా ఆ చీరను చూశారు. స్పర్శించారు. ఆనందించారు.

పెళ్ళివారంతా వచ్చారు.

పెళ్ళి రాత్రి 10 గంటలకు.

పంపకాలు- చీరలు... నగలు... వంటకాలు... ఇలా... చాలా సంభాషణలలో వియ్యపురాలు కోడలు చీరను చూశారు...

"ఎంత అన్నారు?"

కామేశ్వరమ్మ గారు గొప్పగా "30% రిబేటు పోను 4,200/-" అని చెప్పారు.

వియ్యపురాలు నిర్ఘాంత పోయింది. అదే చీర - అంతా అదే చీర తాను కంచి నుండి తన కూతురుకి 2,200/- తెచ్చింది.

ఆమె ఆశ్చర్యానికి కారణం ఏమీ లేదు. - 'ఆడ పెళ్ళి వారికి ఇంత హెచ్చులు ఇంత బడాయా!' అని.

అంతే! ఇక ఆమె కామేశ్వరమ్మ గారు చెప్పే ఏ లెక్కా నిజమని నమ్మ లేదు నేటి వరకూ!

తను ఏమి చెప్తున్నా వియ్యపురాలు ముభావంగా, అనుమాన దృక్కులతో ఎందుకుంటుందోకామేశ్వరమ్మ గారికీ తెలియ లేదు ఇంత వరకూ!